క్లుప్తంగా

ప్రభుత్వ విప్‌ను కలిసిన మున్సిపల్ చైర్మన్



శుభాకాంక్షలు తెలుపుతున్న చైర్మన్, నాయకులు

జమ్మికుంట: ప్రభుత్వ విప్‌గా నియామకమైన ఎమ్మెల్సీ పాడి కౌశిక్‌రెడ్డిని హైదరాబాద్‌లో మున్సిపల్ చైర్మన్ తక్కళ్లపెల్లి రాజేశ్వర్‌రావు, మున్సిపల్ వైస్ చైర్మన్ దేశిని స్వప్నకోటి, పీఏసీఎస్ చైర్మన్ పోనగంటి సంపత్, కౌన్సిలర్ బొంగోని వీరన్న, దళిత బంధు కోఆర్డినేటర్ దుర్గాప్రసాద్ ఆదివారం మర్యాద పూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛం అందజేసి , శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో పట్టణం, మండలంలోని ప్రజా ప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.

బండ ప్రకాశ్‌ను సన్మానించిన వైస్ ఎంపీపీ



బండ ప్రకాశ్‌ను సన్మనిస్తున్న వైస్ ఎంపీపీ

వీణవంక: శాసన మండలి డిప్యూటీ వైస్ చైర్మన్‌గా బండ ప్రకాశ్ ఎన్నిక పట్ల వైస్ ఎంపీపీ రాయిశెట్టి లత, తెలంగాణ ముదిరాజ్ మహాసభ రాష్ట్ర అధికార ప్రతినిధి ఉప్పరవేని రంజిత్, కేడీసీసీ ఉపాధ్యక్షుడు పింగిలి రమేశ్ హైదరాబాద్‌లో మర్యాద పూర్వకంగా కలిసి సన్మానించారు. వైస్ చైర్మన్‌గా ఎన్నికవ్వడం హర్షనీయమని, సీఎం కేసీఆర్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

కోతలు లేని కరెంట్ అందించాలి

జమ్మికుంట: రాష్ట్ర ప్రభుత్వం రైతాంగానికి 24 గంటల విద్యుత్ అందిస్తున్నామని చెబుతున్నా, కరెంట్ కోతలతో రైతులు ఇబ్బందులు పడుతున్నారని, కోతలు లేని విద్యుత్ అందించాలని రైతు సంఘం జిల్లా కమిటీ సభ్యులు చెల్పూరి రాములు ఆదివారం డిమాండ్ చేశారు. వాతావరణం అనుకూలించక వరిపంటకు మొగి పురుగు సోకి నష్టం వాటిల్లిందని, ఇప్పుడిప్పుడే పొలం కోలుకుంటుందని, ఇలాంటి సమయంలో నీరందకపోతే సరైన దిగుబడి రాదన్నారు. అక్కడక్కడ పంటలు పొట్ట దశకు చేరాయని సీఎం కేసీఆర్ రైతులను ఆదుకోవాలని కోరారు.

ప్రజాప్రస్థానం పాదయాత్రకు తరలిన నాయకులు



పాదయాత్రలో వైఎస్ షర్మిలతో నాయకులు

చొప్పదండి: ఉమ్మడి వరంగల్ జిల్లాలో కొనసాగుతున్న ప్రజా ప్రస్థానం పాదయాత్రకు చొప్పదండి నియోజకవర్గానికి చెందిన వైఎస్సార్‌టీపీ నాయకులు ఆదివారం తరలివెళ్లారు. నియోజకవర్గ ఇన్‌చార్జి తడగొండ సత్యరాజ్‌వర్మ, జగిత్యాల జిల్లా మహిళా అధ్యక్షురాలు గాదె స్రవంతి షర్మిలతో కలిసి యాత్రలో పాల్గొన్నారు.

గాయత్రి పంప్‌హౌజ్‌ను సందర్శించిన విద్యార్థులు



పంప్‌హౌజ్ వద్ద విద్యార్థులు

గంగాధర: విహార యాత్రలతో విద్యార్థుల్లో విజ్ఞానం పెంపొందించవచ్చని సరస్వతి విద్యాలయం కరస్పాండెంట్ ఉప్పుల శ్రీనివాస్ అన్నారు. మండలంలోని వెలిచాల సరస్వతి విద్యాలయం విద్యార్థులు మండలంలోని లక్ష్మీపూర్ గ్రామంలోని గాయత్రి పంప్‌హౌజ్‌ను ఆదివారం సందర్శించారు. పంప్‌హౌజ్ మోటార్ల పనితీరును స్థానిక ఇంజనీర్లు విద్యార్థులకు వివరించారు.

ఒంటరివారికి పింఛన్



- పింఛన్ పొందే భర్త మరణిస్తే ఆ స్థానంలో భార్యకు మంజూరు
- తాజా నిర్ణయంతో పలువురిలో చిగురిస్తున్నఆశలు
- అర్హులను గుర్తించే పనిలో నిమగ్నమైన అధికారులు



ఎంపీడీవో కార్యాలయం ఎదుట పింఛన్ కోసం నిరసన వ్యక్తం చేస్తున్న మహిళ

హుజూరాబాద్‌రూరల్: పింఛన్ పొందుతున్న భర్త మరణిస్తే ఆయన స్థానంలో భార్యకు పింఛన్ మంజూరు చేయాలని ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు గ్రామాల్లో అర్హులను గుర్తించి, దరఖాస్తు చేసుకునేలా కృషి చేయాలని ఉన్నతాధికారుల నుంచి ఆదేశాలు వెలువడ్డాయి. దీంతో ఆయా గ్రామాల్లో కార్యదర్శులు అర్హులను గుర్తించే పనిలో నిమగ్నమయ్యారు. దరఖాస్తు చేసిన 15 రోజుల్లో మంజూరయ్యేలా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వం సూచించడంతో ప్రక్రియ వేగంగా సాగుతోంది. ఈ తరహా పింఛన్లు ఏళ్లుగా ఆగిపోగా ప్రభుత్వ తాజా నిర్ణయంతో అర్హులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

మూడేళ్లుగా పక్కనబెట్టిన ప్రభుత్వం

ఆసరా దరఖాస్తులను ప్రభుత్వం మూడేళ్ల పాటు పక్కన బెట్టింది. గతేడాది ఆగస్టులో కొత్త పింఛన్లు మంజూరు చేసింది. అన్ని విభాగాల్లో అర్హులను గుర్తించారు. భర్త మృతి చెందితే ఆయన స్థానంలో భార్యకు మంజూరు చేయలేదు. వితంతు విభాగం కింద దరఖాస్తు చేసుకోవాని చెప్పేవారు. పింఛన్ మంజూరుకాక ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరిగారు. ఎంపీడీవో కార్యాలయం, జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో నిర్వహించే ప్రజావాణికి తరచూ వస్తూనే ఉన్నారు.

ప్రతినెలా సమీక్ష

అర్హులను గుర్తించి ఫిబ్రవరి నుంచి పింఛన్ మంజూరు చేయాలని ప్రభుత్వం పేర్కొంది. ప్రతినెల ఇలాంటి బాధితులను గుర్తించి తక్షణం లబ్ధి చేకూరేలా వెబ్‌సైట్‌లో అప్డేట్ చేయాలని ఉన్నతాధికారులు ఆదేశించారు. భర్త చనిపోయిన వెంటనే మరణ ధ్రువీకరణ పత్రం జారీ చేయడంతో పాటు భార్య వివరాలతో ఎంపీడీవో కార్యాలయంలో ఆసరాకు దరఖాస్తు చేయించాలని సూచించారు.

ఎంపీడీవో కార్యాలయంలో నమోదు

ఆసరా వెబ్‌సైట్ ఇప్పటికి మూసే ఉంది. భర్తను కోల్పోయిన వారికి పింఛన్ మంజూరు చేయడానికి ఎంపీడీవో కార్యాలయాల్లో వివరాలు నమోదు చేస్తున్నారు. పంచాయతీ కార్యదర్శులు ఇక్కడే చేయిస్తున్నారు. బాధితుల్లో చాలా మంది ఇదివరకే వితంతు పింఛన్‌కు దరఖాస్తు చేసుకోగా కొందరికి మంజూరైంది.

దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియ ఆలస్యం

మండల వ్యాప్తంగా 285 మంది వితంతువులు ఉన్నారు. ప్రభుత్వం ఇటీవల జారీ చేసిన ఉత్తర్వులపై గ్రామ పంచాయతీ కార్యదర్శులు అవగాహన కల్పిస్తున్నారు. పింఛన్ మంజూరుకు ప్రభుత్వం ప్రత్యేకంగా దరఖాస్తుల స్వీకరణ చేపట్టింది. దరఖాస్తు ప్రక్రియ రెండంచెల విధానంలో ఉండగా భర్త మృతి చెందింతే మరణ ధ్రువీకరణ పత్రం ఉండాలనే నిబంధన ఉంది. దీనికి తోడు చాలా గ్రామాల్లో వితంతువులు నిరక్షరాసులుకావడంతో దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియ ఆలస్యమవుతోంది.

ఇబ్బందులు ఎదురవుతున్నాయి



నా భర్త పాము కాటుతో చనిపోయాడు. అప్పటి నుంచి కుటుంబ భారం నాపై పడింది. నలుగురు కుమార్తెలు.. వారి ఆలన, పాలన చూడాలంటే కూలీనాలీ చేసుకుంటూ పోషిస్తున్నప్పటికీ ఆర్థికంగా ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ప్రభుత్వం ఇటీవల చెప్పినట్టు పింఛన్ మంజూరు చేసి ఆదుకోవాలి.

– గంగారపు రాజేశ్వరి, కాట్రపల్లి

ప్రభుత్వం ఆదుకోవాలి



నా భర్త అనారోగ్యంతో చనిపోవడంతో కుటుంబ భారం నాపై పడింది. కూలీపనులు చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాను. భర్త చనిపోతే ప్రభుత్వం పింఛన్ ఇస్తుందని అధికారులు చెబుతున్నారు. దరఖాస్తు చేసుకున్నా.. పింఛన్ ఇచ్చి ఆదుకోవాలి. ఇప్పటి వరకు పింఛన్ రాకపోవడంతో అవస్థలు పడుతున్నాం.

– తునికి స్వరూప, రంగాపూర్

అర్హులు దరఖాస్తు చేసుకోవాలి



భర్తను కోల్పోయిన వారికి వెంటనే పింఛన్ మంజూరు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. దరఖాస్తులు తీసుకుంటున్నాం, ఈ కార్యక్రమం ప్రతినెల కొనసాగుతుంది. అర్హులైనవారు వెంటనే దరఖాస్తు చేసుకోవాలి. గ్రామ పంచాయతీ కార్యదర్శులకు మౌఖిక ఆదేశాలు కూడా జారీ చేశాం.

– విజయలక్ష్మి, ఎంపీడీవో, హుజూరాబాద్

నియామకం

చొప్పదండి: జాతీయ ఎస్సీ పరిరక్షణ సమితి చొప్పదండి మండల కన్వీనర్‌గా పట్టణానికి చెందిన వడ్లూరి సుధాకర్‌ను నియమించామని జాతీయ ప్రధాన కార్యదర్శి ఉప్పులేటి లక్ష్మణ్ ప్రకటించారు. అంబేడ్కర్, జగ్జీవన్‌రాం ఆశయాలకు అనుగుణంగా పని చేయాలని సూచించారు. ఈసందర్భంగా నియామకానికి సహకరించిన నేతలకు సుధాకర్ కృతజ్ఞతలు తెలిపారు.

భూమిపూజను అడ్డుకున్న పోలీసులు

శంకరపట్నం: మండలంలోని కేశవపట్నం గ్రామంలో ఆదివారం దివంగత, మాజీ మంత్రి ముద్దసాని దామోదర్‌రెడ్డి, సర్వాయిపాపన్న విగ్రహాల నిర్మాణం కోసం నిర్వహిస్తున్న భూమిపూజ కార్యక్రమాన్ని పోలీసులు అడ్డుకున్నారు. కేశవపట్నం మెయిన్ రోడ్డు పక్కన విగ్రహాల కోసం నిర్వాహకులు ఏర్పాట్లు చేశారు. విగ్రహాల నిర్మాణానికి కలెక్టర్ అనుమతి ఉండాలని పోలీసులు ఆంక్షలు విధించడం సరికాదని టీటీడీపీ మండల అధ్యక్షుడు సయ్యద్‌ఆరీఫ్, గౌడ సంఘం నాయకులు ఆరోపించారు.

భక్తిశ్రద్ధలతో గంగామాత కల్యాణం

కరీంనగర్ కల్చరల్: తెలంగాణ బెస్త, గంగపుత్ర సంఘం ఆధ్వర్యంలో మానేరు డ్యాం వద్ద గల గంగామాత ఆలయంలో ఆదివారం బోనాలు, అమ్మవారి కల్యాణం వైభవంగా నిర్వహించారు. జరిగాయి. ముఖ్య అతిథులుగా హాజరైన ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్, కరీంనగర్ మేయర్ యాదగిరి సునీల్‌రావు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. కార్పొరేటర్లు ఆకుల నర్సయ్య, చొప్పరి జయశ్రీ, దిండిగాల మహేశ్, పెద్దపల్లి జితేందర్, ఐలేందర్ యాదవ్, తోట రాములు, సంఘం జిల్లా అధ్యక్ష, కోశాధికారులు దేశ శివకుమార్, డోలి రాజన్న, పట్టణ అధ్యక్షుడు కూర ధర్మరాజు, ఆలయ కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు లక్ష్మీనారాయణ, ఆనంద్, కోశాధికారి సత్యనారాయణ తదితరులున్నారు.

బిల్లుల చెల్లింపులో జాప్యంపై ధ్వజం



మండల సభలో అధికారులు, ప్రజాప్రతినిధులు

చొప్పదండి: గ్రామాల్లో పూర్తి చేసిన అభివృద్ధి పనులకు అధికారులు వెంటనే మెజర్‌మెంట్స్ రికార్డు చేసి బిల్లులు చెల్లించాలని మండల పరిషత్ సర్వసభ్య సమావేశంలో సభ్యులు ముక్తకంఠంతో డిమాండ్ చేశారు. మండల పరిషత్‌లో ఆదివారం ఎంపీపీ చిలుక రవీందర్ అధ్యక్షతన మండల సభ నిర్వహించారు. రైతుబంధు అరకొరగా కొంతమందికి మాత్రమే ఇచ్చారని, డ్రిప్, స్ప్రింక్లర్ యూనిట్లు ఎందుకు కేటాయించడం లేదని, మహిళా సంఘాల్లో అర్హత ఉన్న మహిళలకు రూ. 2 లక్షల రుణ వితరణ ఎందుకు చేయడం లేదని ఎంపీటీసీ సింగిరెడ్డి ప్రశ్నించారు. ఆసరా పింఛన్ పొందుతున్న భర్త మరణిస్తే వెంటనే మృతుడి భార్యకు వితంతు పింఛన్ మంజూరు చేయాలన్నారు. ఆచరణలో అధికారులు విఫలమవుతున్నారని ఎంపీటీసీ బత్తుల లక్ష్మీనారాయణ విమర్శించారు. మరణ ధృవీకరణ పత్రం మృతి చెంది నెల రోజులు దాటితే ఇవ్వమని పంచాయతీ కార్యదర్శులు చెబుతున్నారని సభ్యులు ధ్వజమెత్తారు. మధ్యాహ్న భోజనం తయారీలో నాణ్యత ఉండటం లేదని, హెచ్‌ఎంలు పర్యవేక్షించడం లేదని ఆరోపించారు. సమావేశంలో ఎంపీడీవో స్వరూప రాణి, సర్పంచులు, ఎంపీటీసీలు, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్ నాయకుల సంబురాలు



సంబరాలు చేసుకుంటున్న బీఆర్‌ఎస్ నాయకులు

వీణవంక: ఎమ్మెల్సీ పాడి కౌశిక్‌రెడ్డి ప్రభుత్వ విప్‌గా నియామకం కావడంతో మండలంలోని ఆయా గ్రామాల్లో బీఆర్‌ఎస్ నాయకులు సంబరాలు జరుపుకున్నారు. టపాసులు పేల్చి స్వీట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ నీల కుమార్, బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకులు సాదవరెడ్డి, గంగాడి తిరుపతిరెడ్డి, ప్యాక్స్ చైర్మన్ విజయభాస్కర్‌రెడ్డి, కలకొండ మధుకర్‌రెడ్డి, కాసర్ల సుధాకర్, మ్యాక వీరయ్య, గొట్టిముక్కల రవీందర్‌రావు, ఎంపీటీసీల ఫోరం జిల్లా అధ్యక్షుడు నాగిడి సంజీవరెడ్డి, ఉపసర్పంచ్‌ల ఫోరం మండల అధ్యక్షుడు శ్రీనివాస్ యాదవ్, యాసిన్, కట్కూరి మధుసూదన్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

బీజేపీ బూత్ కన్వీనర్ల సమావేశం



సమావేశమైన బీజేపీ బూత్ కన్వీనర్లు

రామడుగు: మండలంలోని కిష్టంపల్లి గ్రామంలో ఆదివారం దత్తోజిపల్లి, కిష్టంపల్లి, వెంకట్రావుపల్లి గ్రామాల బీజేపీ బూత్ కన్వీనర్ల సమావేశం నిర్వహించారు. కార్యక్రమానికి జిల్లా ప్రధాన కార్యదర్శి బత్తుల లక్ష్మీనారాయణ హాజరై మాట్లాడారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం అన్ని వర్గాల ప్రజలను మోసం చేసిందని, విద్యుత్ సరఫరాలో పూర్తిగా విఫలమైందన్నారు. ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లి రాబోయే రోజుల్లో బీజేపీ గెలుపు కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపు నిచ్చారు. కార్యక్రమంలో నాయకులు పొన్నం శ్రీనివాస్, బద్దం లక్ష్మారెడ్డి, ఎల్లయ్య, అనంతరెడ్డి, నరేష్, దైవాల తిరుపతి, అనిల్, శ్రీనివాస్‌రెడ్డి తదితురులు పాల్గొన్నారు.

25, 26 తేదీల్లో ఎంఐఎం జాతీయ సదస్సు

విద్యానగర్: ముంబయిలో ఈ నెల 25, 26 తేదీల్లో జరిగే ఎంఐఎం జాతీయ సదస్సును విజయవంతం చేయాలని ఆ పార్టీ కరీంనగర్ నగర అధ్యక్షుడు, తెలంగాణ హజ్ కమిటీ సభ్యుడు సయ్యద్ గులాం అహ్మద్ హుస్సేన్ పిలుపునిచ్చారు. ఆదివారం కరీంనగర్‌లోని ఎంఐఎం కార్యాలయంలో పార్టీ కార్పొరేటర్లతో సమావేశమయ్యారు. ముంబయిలో జరిగే సమావేశానికి పార్టీకి చెందిన సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, జెడ్పీటీసీ సభ్యులు, కౌన్సిల ర్లు, కార్పొరేటర్లు, ఎంపీ, ఎమ్మెల్యేలు, జిల్లా, నగర కమిటీల బాధ్యులు హాజరవుతారని పేర్కొన్నారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోని ఎంఐఎం కౌన్సిలర్లు, కార్పొరేటర్లు హాజరు కావాలన్నారు. రాష్ట్రంలో జరి గే అసెంబ్లీ ఎన్నికల్లో 50 స్థానాల్లో అభ్యర్థులను నిలబెట్టేందుకు పార్టీ సన్నాహాలు చేస్తోందన్నారు. కరీంనగర్ కార్పొరేషన్ ఎన్నికల్లో పార్టీ తరఫున 35 డివిజన్లలో అభ్యర్థుల గెలుపునకు కృషి చేసేలా డివిజన్ సందర్శన కార్యక్రమానికి శ్రీకారం చుట్టినట్లు చెప్పారు.

ఆధ్యాత్మికం

ఉత్సవ విగ్రహాల ఊరేగింపు



భూదేవి, నీలాదేవి సమేత మత్స్యగిరీంద్రస్వామి ఊరేగింపు

శంకరపట్నం: మండలంలోని కొత్తగట్టు గ్రామంలో భూదేవి, నీలాదేవి సమేత మత్స్యగిరీంద్రస్వామి ఉత్సవ విగ్రహాలను ఆదివారం గ్రామంలో ఊరేగించారు. మహిళలు మంగళహారతులతో స్వాగతం పలికారు. వేద పండితులు శేషం మురళీదరాచార్యులు, మాదవాచార్యులు ఆశీర్వచనాలు ఇచ్చారు. కార్యక్రమంలో చైర్మన్ మల్హర్రావు, సర్పంచ్ కిషన్‌రావు, ధర్మకర్తలు పాల్గొన్నారు.

వైభవంగా మారెమ్మ బోనాలు

వీణవంక: మండలంలోని భేతిగల్ గ్రామంలో రజకులు మారెమ్మ, పోచమ్మ బోనాలను వైభవంగా నిర్వహించారు. నెత్తిన బోనాలతో వీధుల గుండా ఊరేగింపుగా ఆలయాలకు చేరుకుని నైవేద్యం సమర్పించారు. అనంతరం పట్నాలు వేసి మొక్కులు చెల్లించుకున్నారు. పంటలు సంవృద్ధిగా పండాలని వేడుకున్నారు. కార్యక్రమంలో రజక సంఘం అధ్యక్షుడు సారంగం, పోషయ్య, రవీందర్, చాపల సతీశ్ తదితరులు ఉన్నారు.

ఎల్లమ్మ ఆలయ కమిటీ



నూతన కార్యవర్గ సభ్యులతో గౌడ కులస్థులు

గన్నేరువరం: మండలంలోని మైలారం గ్రామంలో గౌడ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం ఎల్లమ్మ ఆలయ కమిటీ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. చైర్మన్‌గా గుర్రం శ్రీనివాస్‌గౌడ్, వైస్ చైర్మన్‌గా పైడిపల్లి శ్రీనివాస్‌గౌడ్, కార్యదర్శిగా పులి మల్లేశంగౌడ్, కోశాధికారిగా బుర్ర శ్రీనివాస్‌గౌడ్ నియామకమయ్యారు. కార్యక్రమంలో బొమ్మ రాములుగౌడ్, బుర్ర రాములుగౌడ్, కులసభ్యులు పాల్గొన్నారు.

పోచమ్మతల్లికి బోనం, ఎదురు పట్నం

కరీంనగర్‌రూరల్: కరీంనగర్ మండలంలోని చెర్లభూత్కూర్‌లో పోచమ్మ, బొడ్రాయి, భూలక్ష్మి, మహాలక్ష్మి దేవతల విగ్రహ ప్రతిష్ఠ చేసి, ఏడాది పూర్తయిన సందర్భంగా ఆదివారం పోచమ్మతల్లికి బోనం తీసి, ఎదురు పట్నం వేశారు. ముందుగా బైండ్ల పూజారులు బొడ్రాయి ఎదుట పట్నం వేశారు. అనంతరం పోచమ్మ దేవాలయంలో ఎదురు పట్నం వేసి, ప్రత్యేక పూజలు నిర్వహించారు. డప్పుచప్పుళ్ల మధ్య మహిళలు బోనాలతో ఊరేగింపుగా తరలివచ్చి, మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో సర్పంచు దబ్బెట రమణారెడ్డి, ఉపసర్పంచు చిట్కూరి శేఖర్, ఎంపీటీసీ సభ్యుడు బుర్ర తిరుపతిగౌడ్, కరీంనగర్ సింగిల్‌విండో చైర్మన్ పెండ్యాల శ్యాంసుందర్‌రెడ్డి, వార్డుసభ్యులు తదితరులు పాల్గొన్నారు.

కరాటే పోటీల్లో విద్యార్థుల ప్రతిభ



విద్యార్థులను అభినందిస్తున్న ప్రజాప్రతినిధులు, అధికారులు

హుజూరాబాద్: జిల్లా కేంద్రంలో గుజురియా కరాటే అసోసియేషన్ ఆధ్వర్యంలో ఇటీవల జరిగిన జాతీయ స్థాయి కరాటే పోటీల్లో హుజూరాబాద్ విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభ కనబర్చి మెడల్స్ సాధించినట్లు కరాటే మాస్టర్ ఎస్కే జలీల్ తెలిపారు. పోటీల్లో ఏడుగురు విద్యార్థులు పాల్గొనగా కట్టాస్, స్పారింగ్ విభాగాల్లో ప్రతిభ కనబర్చి గోల్డ్, సిల్వర్ మెడల్స్‌ను సాధించారు. అనంతరం విద్యార్థులను ప్రజాప్రతినిధులు, అధికారులు అభినందించారు.

సిల్వర్ మెడల్ సాధించిన విద్యార్థులు

గంగాధర: ఒకినావా మార్షల్ ఆర్ట్స్ అకాడమీ ఆధ్వర్యంలో నిర్వహించిన తెలంగాణ ఇంటర్ స్టేట్ కరాటే చాంపియన్ షిప్ కప్ 2023 పోటీల్లో మండల కేంద్రంలోని వివేకానంద పాఠశాల విద్యార్థిని దాసరి అక్షర సిల్వర్ మెడల్ సాధించినట్లు పాఠశాల కరస్పాండెంట్ లక్ష్మారెడ్డి తెలిపారు. పతకం సాధించిన విద్యార్థినిని ఉపాధ్యాయులు, విద్యార్థులు అభినందించారు.

5కె రన్‌లో సైదాపూర్ విద్యార్థులు



5కె రన్‌లో సైదాపూర్ విద్యార్థులు, తదితరులు

సైదాపూర్: సిద్దిపేట కమిషనరేట్ ఆధ్వర్యంలో హుస్నాబాద్‌లో ఆదివారం నిర్వహించిన 3వ విడత హాఫ్ మారథాన్‌కు సైదాపూర్ నుంచి విద్యార్థులు తరలివెళ్లారు. 5 కె రన్‌ను హుస్నాబాద్ ఎమ్మెల్యే సతీశ్‌కుమార్, సీపీ శ్వేత, ఏసీపీ మహేందర్, సీఐలు రఘుపతిరెడ్డి, ఎర్రల కిరణ్ జెండా ఊపి ప్రారంభించారు. గాడెపాక కుమార్‌రాజా కూతురు విద్వాన్‌రెడ్డి కృష్ణమూర్తి, అశోక్‌ల ఆధ్వర్యంలో సోమారం మోడల్ స్కూల్ విద్యార్థులు తరలి వెళ్లి మెడల్స్ సాధించారు.

'స్వార్థ రాజకీయాల కోసమే బీఆర్‌ఎస్'

కరీంనగర్‌టౌన్: 60వ డివిజన్ జ్యోతినగర్‌లోని హనుమాన్ చౌరస్తాలో ఆదివారం సాయంత్రం బీజే పీ స్ట్రీట్ కార్నర్ సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన పార్టీ అసెంబ్లీ కన్వీనర్ దుబాల శ్రీనివాస్ మాట్లాడుతూ.. టీఆర్‌ఎస్ పార్టీ తెలంగాణ అమరవీరుల త్యాగాలను, ఉద్యమ ఆకాంక్షలను విస్మరించి, స్వార్థ రాజకీయాల కోసమే బీఆర్‌ఎస్‌గా ఆవిర్భవించిందని ఆరోపించారు. టీఆర్‌ఎస్ తో తెలంగాణను ఉద్ధరించనోళ్లు.. బీఆర్‌ఎస్‌తో దేశాన్ని ఉద్ధరిస్తామనడం హాస్యాస్పదంగా ఉందని ఎద్దేవా చేశారు. బీఆర్‌ఎస్ ఏర్పాటుతో సీఎం కేసీఆర్‌కు, తెలంగాణ రాష్ట్రానికి ఉన్న బంధం తెగిపోయిందని అన్నారు. రాష్ట్రంలో రాబోయేది బీజేపీ సర్కారేనని ధీమా వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యాలను ఇంటింటికీ వెళ్లి, ప్రజలకు వివరించాలని సూచించారు. నాయకులు మంతెన కిరణ్, జానపట్ల స్వామి, శానగొండ శ్రీనివాస్, తణుకు సాయి, పుల్లెల రమేశ్, స్థానికులు పాల్గొన్నారు.

ఆత్మీయ సమ్మేళనం



ఆత్మీయ సమ్మేళనంలో తిమ్మాపూర్ మండల కేంద్రంలోని ఎల్‌ఎండీకాలనీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థులు

మానకొండూర్/చొప్పదండి: తిమ్మాపూర్ మండల కేంద్రంలోని ఎల్‌ఎండీకాలనీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 1997–98, చొప్పదండి మండల కేంద్రంలోని గీతా విద్యాలయం 1995–96 పదో తరగతి విద్యార్థులు ఆదివారం ఆ యా పాఠశాలల్లో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. పూర్వ విద్యార్థులు అంతా ఒకచోట చేరి ఆనందంగా గడిపారు. చదువుకున్న రోజులనాటి జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. ఒకరికొకరు యోగక్షేమాలను తెలుసుకున్నారు. ఈసందర్భంగా చనిపోయిన తోటి మిత్రులకు నివాళి అర్పించారు. అనంతరం విద్యాబుద్ధులు నేర్పిన గురువులను ఘనంగా సన్మానించారు. ఎల్‌ఎండీకాలనీ జెడ్పీహెచ్‌ఎస్‌లో చదివి దేశసేవ చేసిన రిటైర్డ్ ఆర్మీ అధికారి బిస్మల్లాను తోటిమిత్రులు సత్కరించారు.



చొప్పదండి మండల కేంద్రంలో సమావేశమైన విద్యార్థులు